



# నాన్నా! నన్నెందుకు విడిచావు?

ఎన్.శివనాగేశ్వరరావు

**చే**తిలోని బోటనీ పుస్తకం మీద దృష్టి కేంద్రీకరించలేకపోయాను. మస్తిష్కం నిండా రకరకాల ఆలోచనలు ముప్పిరిగొన్నాయి. ఆ ఆలోచనలను ప్రక్కకునెట్టి చదవాలని గంటనుంచి ప్రయత్నం చేస్తున్నాను గాని... మనసు లగ్నం చేయలేకపోతున్నాను.

ఆ ప్రయత్నం ఫలించదని రూఢి అయింది. చేతిలోని పుస్తకం టేబిల్ మీద పెట్టి వెళ్ళి మంచం మీద వాలాను.

వాల్ క్లాక్ పదకొండు గంటలు చూపిస్తున్నది. కిటికీ లోంచి వెన్నెల మనోహరంగా దర్శనమిస్తున్నది. నేను ప్రకృతి అందం ఆస్వాదించే స్థితిలో లేను. నా దృష్టి గోడకు తగిలించి ఉన్న క్యాలెండర్ మీద పడింది. అందులో రెండేళ్ళ పాప, తండ్రి బుగ్గ ముద్దాడుతున్నది. ఆ పాప వదనంలోని పసితనం, తండ్రి ముఖంలోని అనిర్వచనీయమైన ఆనందం ఫొటోగ్రాఫర్ అద్భుతంగా కెమేరాలో బంధించాడు.

నాకు నాన్న జ్ఞాపకానికి వచ్చాడు. ఎప్పుడో పదేళ్ళ క్రితం చూసిన రూపం. అయినా మరిచింది లేదు. ఎందుకంటే ప్రతిక్షణం నాన్న రూపం నా మదిలో మెదులుతూనే ఉంటుంది. అప్పుడు నా హృదయం ఆనందంతో నిండిపోతుంది. ఎడారిలో దప్పికగొన్న వాడికి అమృత భాండం దొరికిన అనుభూతి కలుగుతుంది.

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అమ్మ గదిలోకి వచ్చింది. 'వైజయంతీ? ఇంకా నిద్రపోలేదా? టైమ్ పదకొండు దాటింది. ఇక నిద్రపో!'' అని లైట్ ఆర్పి వెళ్ళింది.

ప్రక్కమీద అటు, ఇటు దొర్లానుగాని నిద్రపట్టలేదు. మనసంతా నాన్న జ్ఞాపకాలతో నిండిపోయింది. హృదయం అతని ప్రేమకోసం అలమటించసాగింది. ''నాన్నా! నన్నెందుకు విడిచావు?'' అనుకున్నాను. కనిపించని తండ్రిని అలా ప్రయత్నించడం నాకు పరిపాటే! నా కన్నుల్లో తడి చేరింది.

పదేళ్ళ క్రితం నాన్న అమ్మను వదిలి వెళ్ళిపోయాడు. అప్పుడు నాకు ఆరేళ్ళు. అమ్మా, నాన్న రోజూ ఘర్షణ పడుతుండేవాళ్ళు. ఆ క్షణాల్లో నేను బిక్కచచ్చిపోయి భయం...భయంగా వాళ్ళ వంక చూస్తుండేదాన్ని. నా భయం గమనించిన నాన్న నన్ను దగ్గరకు తీసుకొని ''ఏం లేదమ్మా! అమ్మ, నేను కొంచెం గట్టిగా మాట్లాడుకుంటున్నాం అంతే! నీవు పడుకో!''అని నిద్రపుచ్చే ప్రయత్నం చేసేవాడు.

నాకు విషయం అర్థంకాకపోయినా అమ్మకు, నాన్నకు పడదని అర్థమయ్యేది. ఎందుకో మనసు దిగులుగా ఉండేది. నిద్ర పట్టేది కాదు.

వాళ్ళిద్దరూ చక్కగా మాట్లాడుకునే సమయంలో నాకు సంతోషంగా ఉండేది. 'అమ్మ, నాన్న ఎప్పుడూ అలా సంతోషంగా ఉండాలని కోరుకునేదాన్ని. అయితే ఆ ఆనందం అట్టేసేపు ఉండేది కాదు. మరలా ఘర్షణ మొదలయ్యేది.

వయసు చిన్నదే అయినా ఎందుకో తనకు అమ్మదే తప్పనిపించేది. అమ్మ గొడవ పెట్టుకున్నప్పుడు నాన్న ముఖం కందిపోయేది. తనకప్పుడు నాన్నను వాటేసుకుని ముద్దుపెట్టి అతని బాధ పోగొట్టాలనిపించేది. కానీ భయంతో అలా చేయలేకపోయేది.

అమ్మ డబ్బు మనిషి. నాన్ననెప్పుడూ చీరలు, నగలు కొనమని పేచీ పెట్టేది. నాన్న ఉన్నంతలో ఏ లోటూ చేసేవాడు కాదు. పెద్ద కోరికలు కోరినప్పుడు 'మధూ! నేను చిన్న జీతగాణ్ణి. అంత పెద్ద కోరికలు తీర్చలేను'అని చెప్పేవాడు. అప్పుడు అమ్మ ''జీతం చాలకపోతే లంచం తీసుకోండి. అందరూ తీసుకోవడం లేదా ఏమిటి? మీరొక్కరు నిజాయితీగా ఉండకపోతే లోకం ఏం మునిగిపోదు''అనేది.

అప్పుడు నాన్న 'చావడానికైనా సిద్ధపడతాను గాని లంచం మాత్రం ముట్టను' అనేవాడు. 'అంతా నా ఖర్మ' అని అమ్మ తల బాదుకునేది.

ఒకరోజు నాన్న ఇంటిదగ్గర లేడు. నాన్నను కలవడానికి ఎవరో వచ్చారు. వాళ్ళు వచ్చిన పని తెలుసుకున్న అమ్మ 'మీ పని పూర్తిచేయించే పూచీ నాది' అని వాళ్ళు ఇవ్వజూపిన లంచం తను అందుకుంది. నాన్న వచ్చే లోపు ఆ డబ్బుతో నగ కొనుక్కుంది.

నాన్నకు విషయం తెలిసింది. మండిపడ్డాడు. అమ్మ, నాన్నను ఖాతరు చేయలేదు. ఈసారి గొడవ చాలా పెద్దదయింది. 'నీలాంటి వాడితో కాపురం చేయనుగాక చేయను'అంది అమ్మ. 'మనసు లేనప్పుడు కాపురం చేయడంకంటే విడిపోవడమే నయం' అన్నాడు నాన్న.

'ఎప్పటినుంచో అదే మాట చెప్పాలనుకుంటున్నాను. మనం విడిపోదాం' అంది అమ్మ. 'మంచిది' అని చెప్పి నాన్న నన్ను ఎత్తుకొని బయటకు నడవబోయాడు. అమ్మ ''అదెక్కడికి?''అని అడిగింది. ''పాప నాతోనే ఉంటుంది'' అన్నాడు నాన్న. 'నా కంఠంలో ప్రాణముండగా అది జరగదు. అయినా తల్లిని, బిడ్డను వేరుచేయడానికి సిగ్గులేదూ?'' అని అమ్మ రెచ్చిపోయింది.

అప్పుడు నాన్న దెబ్బతిన్నట్లు చూసాడు. తరువాత నన్ను క్రిందకు దించి ఒంటరిగా బయటకు నడిచాడు. గడప దాటుతూ నాన్న వెనక్కు తిరిగి నా వంక చూసాడు. ఆ చూపు నా హృదయాన్ని తాకింది. ఆ చూపు ఇన్ని సంవత్సరాలు గడిచినా తనను వెంటాడుతూనే ఉంది. ఆ చూపుకు అర్థం అప్పుడు తెలియదు గాని తరువాత తెలిసింది. మనిషి తన సర్వస్వాన్ని కోల్పోయేటప్పుడు చూసే చూపది.

అలా వెళ్ళిపోయిన నాన్న మరలా కనిపించలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోయాడని తెలిసింది. అతను కనిపించకుండా వెళ్ళిపోయినందుకు అమ్మ ఏం బాధపడలేదు. చేతిలో డిగ్రీ ఉండడం వలన మంచి ఉద్యోగమే సంపాదించింది. ఆ ఉద్యోగానికి పైరాబడి కూడా బాగా ఉండేది. అమ్మ మంచి చీరలు, నగలు కొనుక్కొనేది. ఫ్రెండ్స్ సర్కిల్ పెంచుకుంది. మహిళా మండలిలో సభ్యత్వం సంపాదించింది. కాలక్షేపానికి కొదవ లేదు. అమ్మకు ఒంటినిండా బంగారం, ఇంట్లోకి ఖరీదైన ఫర్నిచర్, స్వంత ఇల్లు కూడా అమరింది.

అమ్మకు ఏ చింతా లేకపోయినా తనకు మాత్రం ప్రతిపక్షం చింతే! మనసులో సంతోషం ఉండేది కాదు. శాంతి ఉండేది కాదు. మనసంతా అలజడి... అశాంతి. తరుచూ నాన్న రూపం మదిలో మెదిలేది. తనను విడిచేపోయే క్షణాన నాన్న చూసిన చూపు జ్ఞాపకం వచ్చి హృదయం కదిలేది. కన్నుల్లో కన్నీరు చోటుచేసుకునేది. మనసు విషాదంతో నిండిపోయేది.

తరుచూ నాన్న రూపం మదిలో మెదిలేది. తనను విడిచేపోయే క్షణాన నాన్న చూసిన చూపు జ్ఞాపకం వచ్చి హృదయం కదిలేది. కన్నుల్లో కన్నీరు చోటుచేసుకునేది. మనసు విషాదంతో నిండిపోయేది.

తనతోటి పిల్లలంతా ఆడుకుంటుంటే తను మాత్రం ఒంటరిగా కూర్చుని నాన్న గురించి ఆలోచించేది. అమ్మ నా సరదాకోసం బోలెడన్ని బొమ్మలు కొనేది. వాటి మీద నాకేమాత్రం ఆసక్తి ఉండేదికాదు.

నాన్న అప్పుడెప్పుడో కొన్న ఒక చిన్న బొమ్మంటే తనకు ప్రాణం. ఆ బొమ్మను అపురూపంగా చూసుకునేది. ఆ బొమ్మను తాకితే నాన్నను తాకిన ఫీలింగ్. మనసంతా అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోయేది.

ఒకరోజు అమ్మ 'నీకోసం ఇన్ని బొమ్మలు కొంటే, నీకీ ముసలిప్పటి బొమ్మే కావలసి వచ్చిందా?' అని నాన్న కొన్న బొమ్మను బయటకు విసిరి పారేసింది. ఆ రాత్రి తను ఆ బొమ్మకోసం గోడ దూకి కాలు విరగగొట్టుకుంది. కాలు విరిగిన బాధకంటే... ఆ బొమ్మ దొరికిన ఆనందం ఎక్కువనిపించింది. ఆ తరువాత అమ్మ ఎప్పుడూ ఆ బొమ్మను పారేసే ప్రయత్నం చేయలేదు.

హైస్కూల్లో చేరిన తరువాత తన శరీరం అందంగా రూపుదిద్దుకోవడం మొదలుపెట్టింది. మగ తోడులేని వాళ్ళమని తెలిసి కాబోలు కొంతమంది కుర్రకారు చవకబారు కామెంట్స్ విసిరేవాళ్ళు. కొన్ని కామెంట్స్‌కి అర్థం తెలిసేది కాదు. అయినా అనకూడని మాట అన్నారని అర్థమయ్యేది. చిత్రంగా నాన్న గుర్తుకు వచ్చేవాడు. నాన్న ఉంటే తనకెంత రక్షణగా ఉండేది? నాన్న దృఢమైన బాహువుల గూడులో తనెంత వెచ్చగా ఒదిగి ఉండేది? అనిపించేది. "నాన్నా! నన్నెందుకు విడిచావు?" అనుకునేదాన్ని.

కొంతమంది మాస్టర్లు అమ్మ గురించి ఆరాతీసేవాళ్ళు. వాళ్ళ మాటల్లో అమ్మపట్ల ఆసక్తి ఉండేది. ఆ మాటలు అమ్మతో చెప్పేదాన్ని. "రోగ్స్... వాళ్ళ మాటలు పట్టించుకోకు"అని తేలికగా తీసి పారేసేది.

అమ్మ తరుచూ నన్ను 'ఎందుకలా జడ పదార్థంలా పడి ఉంటావు? అసలు హుషారన్నదే లేదు' అని కసురుకునేది. నిజంగానే నాకసలు హుషారన్నదే ఉండేది కాదు.

మనసు బాగుండనప్పుడు నాన్నను గుర్తుచేసుకొనేదాన్ని. అప్పట్లో నాన్న నా మీద చూపిన ప్రేమ తలచుకుంటే చాలు నాకెంతో బలం వచ్చేది. హృదయం సేద తీరేది.

అమ్మ నాన్నను చాలా హింసించింది. మనిషిగా చూసింది కాదు. భర్తగా గౌరవించింది లేదు. అసలు నాన్నతో తెగతెంపులు చేసుకోవాలనుకుంది కూడా అమ్మే! అందుకే నాన్న అమ్మకు దూరమయ్యాడు. కానీ తనను వదులుకుండా ఉండవలసింది అనుకునేదాన్ని.

పోనీ అప్పట్లో తను చిన్నదని, అమ్మతోడు అవసరమని భావించి నాన్న నన్ను విడిచినా, కొద్దిసంవత్సరాల తరువాత వచ్చి నన్ను తనతో తీసుకువెళ్తే బాగుండేది అనుకునేదాన్ని.

ఒకరోజు అమ్మ దూరపుచుట్టం ఒకాయన వచ్చాడు. సాధారణంగా మా ఇంటికి చుట్టాలెవరూ రారు. కానీ ఆ ముసలాయన వచ్చాడు. 'ఇతను నీకు తాతవుతాడు' అని అమ్మ పరిచయం చేసింది. నాకెందుకో అతని మీద వాత్సల్య భావన కలిగింది.

అమ్మ లేనప్పుడు అతన్ని నాన్న గురించి అడిగాను. 'మీ నాన్న చాలా మంచివాడమ్మా! తప్పంతా మీ అమ్మదే! అప్పటికీ నీకోసం మనసు చంపుకొని చాలాకాలం కాపురం చేసాడు. మీ అమ్మ రాక్షసత్వం మరిక భరించలేక వెళ్ళిపోయాడు. నీవంటే మీ నాన్నకు పంచప్రాణాలు' అని చెప్పాడతను.

అప్పుడు అడిగాను "తాతా! అమ్మ తప్పుచేస్తే నాన్న నన్నెందుకు విడిచిపెట్టాడు? నేనేం తప్పు చేసాను?' అని ఆ ప్రశ్నకు ముసలాయన కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. 'అది నీ ప్రారబ్ధం. అతని ప్రారబ్ధం తల్లీ! మీ నాన్నది ఎవరినీ నొప్పించే మనసు కాదు. తల్లిని, కూతుర్ని వేరు చేయడం ఇష్టం లేక ప్రాణప్రదమైన నిన్ను మీ అమ్మకు అప్పగించి వెళ్ళిపోయాడు'అని చెప్పాడు.

'మరి నాన్న ఎక్కడున్నాడు?' అడిగాను. 'అది ఎవరికీ తెలీదమ్మా! అసలు ఉన్నాడో, లేడో!' ముసలాయన కన్నీరు పెట్టాడు.

'ఆ మాట అనకు తాతా! నాన్నకేం కాదు. అతను ఎక్కడో ఒకచోట క్షేమంగా ఉండి ఉంటాడు'అన్నాను. ఆ మాటకు తాతయ్య సంతోషించాడు.



'మీ నాన్న చాలా మంచివాడమ్మా! తప్పంతా మీ అమ్మదే! అప్పటికీ నీకోసం మనసు చంపుకొని చాలాకాలం కాపురం చేసాడు. మీ అమ్మ రాక్షసత్వం మరిక భరించలేక వెళ్ళిపోయాడు. నీవంటే మీ నాన్నకు పంచప్రాణాలు'

ఆ రాత్రి చాలాసేపటి వరకూ నాన్న జ్ఞాపకాలతో నిద్ర పట్టలేదు.

నెలరోజుల తరువాత ఒకరోజు అమ్మ షాపింగ్‌కెళ్ళింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నాను. ఆ సమయంలో కాలింగ్ బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా గడ్డాలు, మీసాలతో ఒక వ్యక్తి కనిపించాడు. మనిషి కొంచెం పొడగరి. దేహం శుష్కించి ఉంది. బట్టలు నలిగి ఉన్నాయి. జుట్టు నెరిసి ఉంది.

అతని కళ్ళల్లోకి చూసాను ఉలిక్కిపడ్డాను. ఆ కళ్ళు నాకు బాగా సుపరిచితం. ఎదురుగా ఉన్నది నాన్న అని గుర్తించాను. అతని కళ్ళు నాపై ప్రేమధార కురిపిస్తున్నాయి.

అతను నన్ను చూసి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ "అమ్మా! నీవు... నీవు... నా వైజయంతివే కదూ?"అన్నాడు. నాన్న కన్నులనుంచి కన్నీటి జల్లు. ఇంచుమించు నాదీ అదే పరిస్థితి. ఇంత కాలం నుంచి ఎవరిని తలుచుకుంటూ సంవత్సరాలు గడుపుతున్నానో... ఆ నాన్న ఎదురుగా ఉండేసరికి భావోద్వేగంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

అతను, 'అమ్మా! వైజూ!"అంటూ చేతులు చాపాడు. నేను నాన్న గుండె మీద ఒదిగిపోయాను. నాన్న అపురూపంగా హృదయానికి హత్తుకున్నాడు. నా కళ్ళు వర్షిస్తున్నాయి.

కొద్దిక్షణాలు మేమిద్దరం సకలం మరచిపోయాం. మా ఇరువురి హృదయాలు నిశ్శబ్దంగా సంభాషించుకున్నాయి. సేద తీరాయి.

నాన్న నాకు దూరంగా జరిగి నా కన్నుల్లోకి చూస్తూ "అమ్మా! వైజూ! నా పరిస్థితేం బాగుండలేదు. ఒక్కసారి నిన్ను చూడాలని సుదూరంనుంచి వచ్చాను. అంతేగాని, మరే ఉద్దేశ్యం లేదు"అన్నాడు.

"లోనికి రండి నాన్నా!" అన్నాను. "రానమ్మా! ఎందుకంటే ఇది నా ఇల్లు కాదు. ఇక్కడ నా వాళ్ళెవరూ లేరు." నాన్న స్వరంలో ఆవేదన ఉంది.

నాన్న మరొకసారి నన్ను తృప్తిగా చూసుకుని 'వస్తానమ్మా!" అని వెనుతిరిగాడు. నేను నాన్న చేయిపట్టుకున్నాను. 'ఈసారి కూడా నన్ను విడిచి వెళ్తావా? నాన్నా?"అని ప్రశ్నించాను. నాన్నకు నా భావం అర్థమై, అర్థమవక నావంక సందేహంగా చూసాడు.

"నాన్నా! అమ్మ నీ పట్ల అమానుషంగా ప్రవర్తించింది. అందుకే నీవామెను విడిచివెళ్ళావు? మరి ఏ తప్పు చేయని నన్నెందుకు నాన్నా విడిచావు?" అని ప్రశ్నించాను. నా స్వరం దుఃఖంతో ఒణికింది.

నా ప్రశ్నకు నాన్న చిగురుటాకులా ఒణికాడు. "అమ్మా! వైజయంతీ! నీవు నా ప్రాణం తల్లీ! నిన్ను నాతో తీసుకుపోవాలనే అనుకున్నాను. కానీ తల్లిని, బిడ్డను వేరు చేస్తావా? అన్న మీ అమ్మ మాటకు తల ఒగ్గి నిన్ను దూరం చేసుకున్నాను" నాన్న కళ్ళనుంచి కన్నీరు జలజలా రాలింది.

"నేను నాన్న కన్నీరు తుడిచాను. "నాన్నా! అమ్మ చేసిన తప్పుకు నేను శిక్ష అనుభవించాను. నీకు పదేళ్ళ దూరమయ్యాను. అప్పుడు ఏమీ తెలియని పసిపయసు నాది. ఇప్పుడలా కాదు. అందుకే మరిక నిన్ను దూరం చేసుకోను. నాకు నీ తోడు కావాలి"అన్నాను.

నేనన్న మాటతో నాన్న కన్నుల్లోని వైరాగ్యభావన మాయమయ్యింది. కళ్ళల్లో దివ్యమైన కాంతి నిండుకుంది. నాన్న నా చేతులు పట్టుకుని "అమ్మా! వైజయంతీ? ఈ జన్మకంత భాగ్యమా?"అన్నాడు.

అంతలో కాంపౌండ్‌వాల్ గేటు తెరుచుకుని అమ్మ లోపలకు వచ్చింది. అమ్మ చురకైన కళ్ళు క్షణంలో, నా ఎదురుగా వ్యక్తి ఎవరన్నది పసిగట్టేసాయి. అమ్మ ముఖం అప్రసన్నంగా మారింది. 'వైజూ! లోనికి నడు'అంది కఠినంగా. నేను చలించలేదు. "అమ్మా! నేను నాన్నతో వెళ్ళిపోతున్నాను" అన్నాను స్థిరంగా.

అమ్మ వ్యంగ్యంగా నవ్వి "ఈ బికారితో వెళ్తావా? నీకొపూట గంజి కూడా పోయలేడు. నేనింతకాలం కష్టపడి డబ్బు సంపాదించిందీ నీకోసం. నీకు మంచి సంబంధం చూసి ఘనంగా పెళ్ళి చేయడంకోసం. పిచ్చిగా మాట్లాడక, లోనికి నడు"అంది.

"అమ్మా! నీవు నాన్న పేదరికమే చూసావు గాని అతని మంచి మనసు విలువ గ్రహించలేకపోయావు. నాన్నను దూరంచేసుకుని డబ్బు సంపాదనలో పడి అందులో ఆనందం అనుభవించావే గాని, నా మనసు గురించి, నేను చెందిన పరితాపం గురించి ఏనాడూ పట్టించుకోలేదు. నీ దగ్గరున్న డబ్బు ఇవ్వలేని మనశ్శాంతి, సంతోషం నాకు నాన్న సమక్షంలో దొరుకుతాయి. సాగర గర్భాన అంతులేని సంపద ఉందని ఏ వ్యక్తీ అందులో మునిగిపోవాలని కోరుకోడు. అందులోంచి బయట పడాలనే చూస్తాడు. నేను చేస్తున్నదీ అదే!"అన్నాను.

అమ్మ దెబ్బతిన్నట్లు చూసింది. "నన్ను వదిలి వెళ్ళావంటే అనుభవిస్తావు"అని శపించింది. అమ్మ శాపం నన్ను భయపెట్టలేకపోయింది.

"రండి నాన్నా! అని నాన్న చేయిపట్టుకుని బయటకు నడిచాను. నాన్న నా భుజాలచుట్టూ చేయివేసి ముందుకు నడుస్తూ "నాకిప్పుడు చాలా తృప్తిగా ఉంది తల్లీ!"అన్నాడు.

ఒకప్పుడు దృఢమైన నాన్న బాహువుల్లో ఇప్పుడు మునుపటి బలం లేకపోవచ్చు. కానీ ఆ బాహువుల గూడులో వెచ్చగా ఒదిగిపోగలను. సేద తీరగలను. నాకు నాన్న ఉన్నాడు. నాన్నకు నేనున్నాను. మేం లోకాన్ని జయించగలం. ★